క్లుప్తంగా

గూడూరు రూరల్ ఎస్‌ఐగా తిరుపతయ్య


బాధ్యతలు చేపట్టిన తిరుపతయ్య

గూడూరురూరల్ : గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా కె.తిరుపతయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. గూడూరు ఒక టో పట్టణ ఎస్‌ఐగా పనిచేస్తున్న తిరుపతయ్య రూరల్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మనోజ్‌కుమార్ బదిలీపై వెళ్లారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సైదాపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ ఎంవి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా మండల కేంద్రంలో శనివారం ప్రతి ఒక్కరు సైకిల్‌పై ప్రయాణించే విధంగా అవగాహన కల్పించారు. అనంతరం సైకిల్ ర్యాలీ చేశారు. అనంతరం మానవహారంగా నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శశిఇంద్రాణి పాల్గొన్నారు.

నేడు కోటలో రచ్చబండ

కోట: మండలంలోని అల్లంపాడు, వంజివాక, పుచ్చలపల్లి గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, సీఈసీ సభ్యులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

సజ్జలతో దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు మోహన్



గూడూరురూరల్ : తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని దివ్యాంగుల విభాగం అధ్యక్షుల ఆత్మీయ సమావేశం సందర్భంగా గూడూరుకు చెందిన ఉమ్మడి నెల్లూరు జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా మోహన్ కలిశారు. ప్రస్తుతం రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులను వేధిస్తూ చంద్రబాబు రాక్షసంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వారిలో నెల్లూరుకు చెందిన ఆవుల నాగేంద్ర, గూడూరుకు చెందిన సాయి భార్గవ్‌రెడ్డి ఉన్నారు.

సీజేఐపై దాడికి యత్నం తగదు

వెంకటగిరి రూరల్: సీజేఐ గవాయ్‌పై దాడికి యత్నించడం సమంజసం కాదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో దళితులకు అన్యాయం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం గూగుల్ సంస్థకు సబ్సిడీ కింద భూములు, విద్యుత్ వంటివి ఇవ్వడం ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. అదే గూగుల్ సంస్థకు తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు వ్యతిరేకిస్తే ఇక్కడ మాత్రం రూ.20వేల కోట్లు సబ్సిడీ ఇవ్వడం సరికాదన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ


నాగముంతల సుబ్బయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిట్టమూరు : మండలంలోని ఉప్పలమర్తి పంచాయతీ ఎం జంగాలపల్లికి చెందిన నాగముంతల సుబ్బయ్యను శుక్రవారం వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు. ఇటీవల నాగముంతల సుబ్బయ్య అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుడడంతో ఎమ్మెల్సీ ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం సుబ్బయ్యకు ధైర్యం చెప్పారు.

పొంగిన పిన్నేరువాగు

సైదాపురం: మండలంలో కురిసిన వర్షాలకు తురిమెర్ల సమీపంలోని పిన్నేరు వాగుపై ఉన్న రహదారిపై వరద నీరు ప్రవహించింది. దీంతో రాకపోకలు సాగించేందుకు శనివారం ఉదయం ప్రజలు ఇబ్బంది పడ్డారు. అనంతరం వర్షం తగ్గడంతో నీరు వంతెన కింద నుంచి ప్రవహించడంతో రాకపోకలు కొనసాగాయి.

చికెన్ ధరలు		19-10-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	127
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	230
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	254
లేయర్ చికెన్	:	200

గ్రామీణ రోడ్లన్నీ రొచ్చురొచ్చు



బురదగుంటలుగా మారిన సైదాపురం-ఊటుకూరు రోడ్డు



పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధి నుంచి వచ్చే ప్రధాన రహదారి దుస్థితి

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని ఆర్అండ్‌బీకి సంబంధించిన ప్రధాన రహదారి చిన్నపాటి వర్షాలకు దుర్భరంగా మారింది. పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపు వీధి నుంచి గాంధీ పార్కు వెనక వెంకటగిరి రోడ్డు వరకు భారీ గుంతలతో బురదమయంగా మారి ఉంది. ఈ రహదారిపై ప్రైవేటు గ్యాస్ పైప్‌లైన్‌తో కోసం ఇష్టారాజ్యంగా రోడ్డు తవ్వకాలు చేపట్టి గుంతలమయంగా మార్చేసి రహదారిని సర్వనాశనం చేసి ఉన్నారు. దీనికి తోడు మేనకూరు సెజ్‌కు వెళ్లే భారీ వాహనాలు సైతం ఈ రహదారిపైనే రాకపోకలు జరుగుతుండడంతో ఈ రహదారి మరింత అధ్వానంగా మారింది. ఇటీవల మున్సిపల్ అధికారులు ఈ రహదారి తమ పరిధిలోకి రాదని చెబుతూ సుమారు రూ.30 లక్షలకు పైగా నిధులతో పిచ్చిరెడ్డితోపు వీధి నుంచి ఎమ్మెల్యే నివాసం సమీపంలో వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రజలతో పాటు అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు జరిపే ఆర్అండ్‌బీ రహదారి దుస్థితి పట్టించుకోక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజుల కిందట ఆర్అండ్‌బీ అధికారులు గుంతలమయంగా మారి పట్టణంలోని రహదారిపై కంకర పొడిన చల్లేసి వదిలేశారు. దీంతో తరచూ కురుస్తున్న వర్షాలకు బురదమయమైంది. ఇప్పటికైనా అధికార పార్టీ నేతలు ప్రత్యేక దృష్టి సారించి యుద్ధప్రాతిపాదికన పనులు చేపట్టేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నీ గుంతలదారులే!

సైదాపురం: గత ప్రభుత్వంలో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. ప్రభుత్వం ఒక్క రోడ్డు రిపేరు చేయలేదు. అధికారంలోకి రాగానే రోడ్లను అద్దంలా మారుస్తామని ఎన్నికల్లో ప్రచారం చేసిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక కొత్త రోడ్ల నిర్మాణం సంగతి దేవుడెరుగు ఉన్న రోడ్లు గుంతలను పూడ్చకుండా గాలికి వదిలేశారు. సైదాపురం-ఊటుకూరు గ్రామానికి వెళ్లాలంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. అడుగుకో గుంత ఉండడంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.



ఆరు కిలోమీటర్ల మేర ధ్వంసమైన సైదాపురం-ఊటుకూరు రోడ్డు

రోడ్లు గుంతలమయం

చిల్లకూరు: గూడూరు మున్సిపాలిటీలో చిల్లకూరు పంచాయతీని విలీనం చేసిన నాటి నుంచి అభివృద్ధి పనులు తామే చేపడతామని మున్సిపల్ అధికారులు తెలియజేశారు. ఈ క్రమంలోనే చిల్లకూరు అరుంధతీయవాడకు పంచాయతీ ఉన్న సమయంలో రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. అయితే పంచాయతీని మున్సిపాలిటీలో చేర్చడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో అరుంధతీయవాడలో రోడ్డు నిర్మాణం ఆటకెక్కింది. దీంతో అరుంధతీయవాడలో వీధులు బురదమయంగా ఉండి రాకపోకలు సాగించలేని స్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు స్థానికులకు ఇబ్బంది లేకుండా బురదమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కమనీయం.. లక్ష్మీ నరసింహుడి కల్యాణం





రాపూరు: కల్యాణోత్సవం చేస్తున్న అర్చకులు, ఊంజల్ సేవకు స్వామిఅమ్మవార్లు, విరాళం ఇస్తున్న ప్రియాంక, చిల్లకూరు: పల్లకీ సేవలో లక్ష్మీనరసింహస్వామి

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు పూలంగిసేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామి అమ్మవార్లను తిరుచ్చిలో సహస్రదీపాలంకరణ మండపంలోకి తీసుకువచ్చి అర్చకులు ఊంజల్‌సేవ నిర్వహించారు.

నిత్య అన్నదానానికి లక్ష విరాళం

శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్య అన్నదాన పథకానికి వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు అనకాల జ్ఞానశ్రీ జన్మదినం సందర్భంగా ఆమె తల్లిదండ్రులు నరసింహులు, ప్రియాంక రూ.లక్ష నగదును అందించినట్లు దేవస్థానం ఏసీ శ్రీనివాసులు తెలిపారు.

పెంచలకోన దేవస్థాన ఏసీ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పరిసరాలు శుభ్రం చేశారు. క్షేత్రంలో చెత్తను తొలగించినట్లు ప్లాస్టిక్ వినియోగించరాదని భక్తులకు వివరించినట్లు ఆయన తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి పల్లకీ సేవ

చిల్లకూరు: మండలంలోని కలవకొండ గ్రామ సమీపంలోని తిప్పపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో పాటు స్వామి వారికి సుప్రబాత సేవ నిర్వహించి, అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం తమ్మినపటం కోదండరామస్వామి దేవస్థానం మాజీ చైర్మన్లు యరటపల్లి శరణ్‌కుమార్, యరటపల్లి పృథ్విరెడ్డి అన్నదానం చేశారు. సాయంత్రం ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ,లక్ష్మీ నరసింహస్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఆలయ ఆవరణలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అర్ధరాత్రి యూరియా దారి మళ్లింపు

పెళ్లకూరు: అర్ధరాత్రి యూరియా దారి మళ్లింపుపై రైతులు ఆందోళనకు దిగిన ఘటన మండలంలోని బంగారంపేట రైతు సేవా కేంద్రం వద్ద చోటు చేసుకుంది. స్థానిక విలేజ్ అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్ (వీఏఏ) శ్రీధర్ శనివారం రాత్రి యూరియా పంపిణీ చేస్తున్నట్లు సమాచారం అందడంతో రైతులందరూ పెద్ద సంఖ్యలో రైతు సేవా కేంద్రం వద్దకు చేరుకున్నారు. రైతులకు పేపర్ స్లిప్పులు ఇచ్చి యూరియా పంపిణీ చేసే ప్రయత్నం చేశాడు. అర్ధరాత్రి యూరియా పంపిణీ చేయడం ఏమిటని కొందరు ప్రశ్నించడంతో రైతుల మధ్య తోపులాట జరిగింది. దారి మళ్లించే ప్రయత్నంలోనే రాత్రి వేళల్లో రైతు సేవా కేంద్రానికి వచ్చిన 400యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్నట్లు కొందరు రైతులు ఆరోపించారు. ఈ విషయమై కొందరు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో యూరియా పంపిణీ నిలిపేశారు.


బంగారంపేట రైతు సేవా కేంద్రం వద్ద ఆందోళనకు దిగిన రైతులు

జగన్ 2.0 కార్యకర్తలకు శ్రీరామ రక్ష


డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

వెంకటగిరి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు జగన్ 2.0 శ్రీరామ రక్షగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు కల్లిరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో శనివారం వెంకటగిరి రూరల్ మండలానికి సంబంధించి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి కార్యకర్తలను అణగతొక్కే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల భరోసా కల్పించే దిశగా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను అమల్లోకి తీసుకొచ్చారన్నారు. ఆర్టీఐ వింగ్ రాష్ట్ర కార్యదర్శి సదానందరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులకు భరోసా కల్పించేందుకు డిజిటల్ బుక్‌ను రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కల్చరల్ విభాగం కార్యదర్శి ములవాయిల వెంకటేశ్వర్లు, సర్పంచ్ సంఘం అధ్యక్షులు తుమ్మూరు మస్తాన్, వైఎస్సార్ రూరల్ మండల నాయకులు గొట్టటి రాజారెడ్డి, ఆవుల గిరియాదవ్, పెద్ద వీరయ్య, శ్రీనివాసులరెడ్డి, వేణురెడ్డి, గుర్రం రవి, దొరస్వామి పాల్గొన్నారు.

అక్కడ టపాసులు నిషేధం

ఓజిలి: మండలంలోని అత్తివరం, ఓజిలి, నాయుడుపేట పరిధిలోని మేనకూరుసెజ్ పరిసర ప్రాంతాల్లోని గ్యాస్ స్టేషన్లు, గ్యాస్ పైపులైన్ల వద్ద దీపావళి సందర్భంగా టపాకాయలు నిషేధిస్తున్నట్లు పరిశ్రమ యాజమాన్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సర్వేస్ రెగ్యులేటర్లు, ఆర్‌సీసీ గార్డులు, వాల్ చాంబర్ల వద్ద బాణాసంచా, కొవ్వొత్తులు వెలిగచరాదని ప్రజలను ముందుగా అప్రమత్తం చేస్తున్నట్లు కోరారు. గ్యాస్‌లైను సమీపంలో టపాకాయలు కాల్చి ఇబ్బందులకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని యాజమాన్యం తెలియజేశారు.

కండలేరులో 60 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 60 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3,060 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. సత్యసాయి గంగ కాలువకు 1900, పిన్నేరుకాలువకు 850, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 200, మొదటిబ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

వెంకటగిరి రూరల్: పట్టణంలోని రాణిపేటలో ఉన్న బాలసదన్‌లోని విద్యార్థులకు యువతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, ఫ్యాన్‌లను పంపిణీ చేశారు. యువతరం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద విద్యార్థులకు పుస్తకాలు, ఫ్యాన్లను వితరణ చేసినట్లు తెలియజేశారు.


చిన్నారులకు పుస్తకాలు, ఫ్యాన్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ


సంతకాల సేకరణలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిట్టమూరు: మెడికల్ కళాశాలలను ప్రవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపడుతున్నామని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. మండల కేంద్రమైన చిట్టమూరు, ఆలేటిపాడు, పిట్టివాని పల్లి గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం చేపట్టేందుకు వచ్చిన ఎమ్మెల్సీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మండల పార్టీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంతకాల సేకరణకు మంచి స్పందన లభించింది. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిప్పల రమణయ్య, మండల ఉపాధ్యక్షులు బీవీ రమణయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పేట రాజీవ్ రెడ్డి, పల్లంపర్తి శ్రీనివాసులరెడ్డి, చిల్లకూరు కోదండరామిరెడ్డి, వంకా చెంచయ్య, కామిరెడ్డి రమేష్, దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, మాచిరెడ్డి సుధీర్‌రెడ్డి, లోకేష్ రెడ్డి, అనీల్‌రెడ్డి, కస్తూరయ్య, గంగాల రమణయ్య, భానుప్రకాష్, జంగిటి సురేష్, పిట్టివానిపల్లి, ఆలేటిపాడు సర్పంచ్‌లు ప్రవీణ్‌కుమార్, హరినాద్, వైసీ పుట్టబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా వెంకటబాబు

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షులుగా గానుగ వెంకటబాబును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేయనున్నట్లు తెలియజేశారు.

టపాసుల దుకాణాల వద్ద నిబంధనలు తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శిరీష

గూడూరురూరల్ : టపాసుల దుకాణాలు నిర్వహించే వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలతోపాటు జాగ్రత్తలు పాటించాలని గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ శిరీష సూచించారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శనివారం పలు శాఖల అధికారులు, బాణసంచా దుకాణ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గూడూరులో బాణసంచా విక్రయించుకునేందుకు 22 దుకాణాలకు లైసెన్సులు ఇచ్చినట్లు తెలిపారు. దుకాణాల వద్ద నీరు, ఇసుకను ఏర్పాటు చేసుకోవాలని, ధరల బోర్డును ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కొనుగోలుదారులు ట్రాఫిక్‌కు స్తంభించకుండా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఆర్.వి.ప్రసాద్, రూరల్ సీఐ కిషోర్‌బాబు, ఏఈ ఏడుకొండలు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

సైదాపురం: టపాసులు విక్రయించే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తహసీల్దార్ సుభద్ర, ఎస్‌ఐ క్రాంతికుమార్‌తోపాటు కలువాయి ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వరుపేర్కొన్నారు. అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లో షాపులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయి రూప

గూడూరురూరల్ : గూడూరు పట్టణంలోని డీఆర్ డబ్ల్యూ కళాశాలలో శనివారం రోటరీ వెస్ట్ క్లబ్ గూడూరు ఆధ్వర్యంలో నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ సహకారంతో క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సాయి రూప మాట్లాడుతూ ఆహార అలవాట్లలో మార్పు చేసుకోవాలన్నారు. ఆరోగ్యం సరిగా లేనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ సలహా తీసుకోవాలని సూచించారు. క్లబ్ అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ విద్య, వైద్యంపై ఎక్కువ కార్యక్రమాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రాఘవరెడ్డి, సీనియర్ రొటేరియన్లు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామ్మోహన్‌రావు, బొమ్మిడి శ్రీనివాసులు, నాసిన నాగులు, గిరిబాబు, సుబ్రమణ్యం, సనత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నవీన్ జయకుమార్, ప్రిన్సిపల్ హనుమంతరావు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు భిక్ష


అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న నక్కా భానుప్రియ, నక్కా వెంకటేశ్వరరావు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని ఉన్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప భక్త బృందం 14వ మండల భిక్ష కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మశాలీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మాలధారణలో ఉన్న అయ్యప్పస్వాములకు స్వయంగా భిక్షను వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లిరెడ్డి, రాజా, సుబ్రమణ్యం, శ్రీధర్మశాస్త్ర భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తాచాటిన చెన్నూరు విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం బాలనాగమ్మ

గూడూరురూరల్ : గూడూరు మండలం చెన్నూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర స్థాయిలో సత్తా చాటుతున్నారు. అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి ఎస్.మోహిత్ బీచ్ వాలీబాల్, 6వ తరగతి విద్యార్థులు వి.సుధీర్, ఎస్.చెంచయ్య స్విమ్మింగ్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్.ఎం.బాలనాగమ్మ తెలిపారు. 10వ తరగతి విద్యార్థి ఎస్.చరణ్ అండర్-19 విభాగం బాక్సింగ్‌లో రాష్ట్ర యికి ఎంపికయ్యాడు. అండర్-17 కబడ్డీలో చరణ్ మండలంలో ద్వితీయ స్థానం సాధించి డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. అండర్-14 విభాగంలో మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో 9వ తరగతికి చెందిన మోహిత్, దినేష్, అండర్-17 వాలీబాల్‌లో డివిజన్ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. మండల, డివిజన్ స్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభ కనబరచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఇటీవల అకాడమీ వారు డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో నిర్వహించిన చదరంగం పోటీల్లో చరణ్ తేజ విజేతగా నిలిచాడు. ఈ మేరకు శనివారం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దిన పీడీ ఎస్.కె.జమీలా, ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.